# మనసు చాలని
# మంచి బ్రతుకు

అంతా అయిపోయింది. ఇందాకటి వరకూ వున్న వెలుతురు, కన్నీరు - అన్నీకూడా అయిపోయాయి. చివరికి చీకటి మిగిలింది. చీకటితో పాటు వెలుతురున్నప్పుడు నీరు కారిపోయి ప్రస్తుతం ఎండిపోయిన కళ్ళుగల విశ్వనాథం కూడా మిగిలాడు.

డాబామీద విశ్వనాథం, 'నేను వెర్రి వెధవ నన్న సంగతి దేవుడిక్కూడా తెలిసిపోయిందే!' అని బాధ పడ్డాడు. అంతకు ముందు తను వెర్రి వెధవ అన్న సంగతి వాళ్లాఫీసు మేనేజరుకీ, రాధా క్రిష్ణగారికీ, మ్యునిసిపాలిటీ వాళ్ళకి మాత్రమే తెలుసు ననుకొని బాధపడేవాడు. అతని బాధలోలోపలే ముసిలివాడి ప్రేమలా మనస్సుని తినేస్తోంది. ఏమైతేనేం విశ్వనాథానికి విశ్రాంతి లేకుండా పోయింది.

నిన్నరాత్రి విశ్వనాథం అందమైన భార్య సుమిత్ర, ఊళ్ళోనూ ఇంట్లోనూ కరెంటు పోయి దీపాలు ఆరిపోయి నప్పుడు, భర్తని కౌగిలించుకోబోయి వెల్లకిలా విరుచుకు పడిపోయింది. ఊళ్ళోనూ, ఇంట్లోనూ, కరెంటు వచ్చి, దీపాలు వెలిగేసరికి విశ్వనాథం పాదాల పక్కన అందమైన సుమిత్ర దేహం, దేవుడు శిల్పి జన్మ ఎత్తి చెక్కిన అందమైన ఆడశిల్పం పడుకోబెట్టినట్టు పడివుంది. వెంటనే విశ్వనాథం కంగారుగా కళ్ళ డాక్టర్నీ, పళ్ళ డాక్టర్నీ, ఒళ్ళు డాక్టర్ని - యింటికి ఆఘమేఘాలమీద రప్పించాడు. ఒకరి తర్వాత ఒకరుగా ముగ్గురూ సుమిత్రని పరీక్షించారు. విశ్వనాథం - ముందు, కళ్ళ డాక్టర్ని దగ్గిరిసా పిలిచి, 'ఏమిటి?' అని అడిగాడు.

కళ్ళడాక్టరు, 'నావి బాగానే వున్నాయి.' అన్నాడు. దూరంనుంచి విని, పళ్ళడాక్టరు కూడా దగ్గిరిసావచ్చి, 'నావీ బాగానే వున్నాయి.' అన్నాడు.

'ఏవిటి?' అని మళ్ళీ అడిగేడు విశ్వనాథం.

'కళ్ళు' అన్నాడు కళ్ళజోడు సవరించుకుంటూ కళ్ళడాక్టరు.

'పళ్ళు' అన్నాడు బోసినోటితో పళ్ళడాక్టరు.

విశ్వనాథం వాళ్ళని అర్థంచేసుకుని, విజిటింగ్ ఫీజియిచ్చి పంపించివేసి, 'ఒళ్ళు డాక్టర్ని' పిలిచి, 'ఏమిటి?' అని అడిగాడు.

'ఒళ్ళు బాగుండలేదు' అన్నాడు ఒళ్ళు డాక్టరు. విశ్వనాథం ఆయన్ని అర్థంచేసు





కోక, "అయ్యో! మీకు శ్రమిచ్చాను. ఎంతమంచివారు! ఒళ్ళు బాగుండకపోయినా రాత్రి పూటా శ్రమతీసుకువచ్చారు!" అన్నాడు.

ఒళ్ళు డాక్టరు ఒళ్ళంతా కుదుపుకుంటూ నవ్వబోయి, పరిస్థితికి అనుకూలమైన పని కాదని, నవ్వుని తుమ్మురూపంలో బదిలీచేసి, 'అదేవిటి భలేవారే - నా ఒళ్ళుకాదు, మీ ఆడవాళ్ళది' అన్నాడు.

'ఒళ్ళెందుకు బాగుండలేదు?' అనడిగాడు విశ్వనాథం.

'కరొనరీ త్రాంబోసిస్'

'అంటే?'

'అంటే గుండెనిండా రక్తం వున్నా, గుండెకు రక్తంలేకపోవడం.'

విశ్వనాథానికి అర్థంకాక, ఆత్రుతగా, 'అసలింతకీ ఏంజరిగింది?' అని అడిగాడు.

'గుండె ఆగిపోయింది - ఆయామ్‌సారీ! మీకిక ఆమెలేదు.' అని ఆయన వెళ్ళిపోయాడు.

వెంటనే విశ్వనాథం ఏడవటం, బాధపడటం ప్రారంభించాడు. పెళ్ళయి, సంసారానికి రెండేళ్ళయినా పాతబడకుండా ఎంతో అందమైన భార్య-ఊళ్ళోనూ, యింట్లోనూ, కరెంటుపోయి దీపాలు ఆరిపోగా, మత్తుగా తన్ను కౌగలించుకొనేవేళ హఠాత్తుగా చనిపోయిందే - అని విపరీతంగా బాధపడ్డాడు. తన్ను చేతనయిన వాడిగా గుర్తించడానికి మిగిలిన ఒక వ్యక్తి పోయాక అతనిలో ఆశ దిగజారింది. అందుకే ఏడిచాడు. నిన్నంతా యింట్లో కూర్చుని ఏడిచాడు. చివరికి యింటిమీద, ఏడుపుమీద విసుగూ, కోపం కలిగాయి. డాబాయెక్కి, ఏడుపు మానేసి నోరు మూసుక్కూర్చుని బాధ పడ్డాడు.

• • •

— ఆర్నెల్లక్రితం అలా జరిగినందుకు, ఆరోనెల చివర అదేడాబా పిట్టగోడమీద, అదేబాధని ఒక్కసారి జ్ఞాపకం చేసుకున్న విశ్వనాథం - ఎదురుగా అల్లంతదూరంలో మౌనంగా కూర్చున్న రాధాక్రిష్ణగారివంక, చెమర్చిన కళ్ళతో చూశాడు.

ఊళ్ళో ఏదో పేరు తెలియని ఆఫీసులో విశ్వనాథం స్టెనోగా పనిచేస్తున్నాడు. అతనికి తండ్రి, తల్లి, ఎడమచేతి చిటికెన వ్రేలు లేవు. ఆర్నెల్లక్రితంనుండి భార్య లేదు. తండ్రివదిలిన డాబాయింట్లో ఏకాకిగా వుంటున్న అతను, యిప్పుడు పాతికేళ్ళ విడోయర్.

రాధాక్రిష్ణగారు చాలాఆస్తిపరులు. ఆయనకూడా సొంత డాబావుంది. పైగా రెండు రైసుమిల్లులు, ఒకతల్లి, ఒకతండ్రి, ఒక భార్య, నలుగురుపిల్లలు-ఉన్నారు. అప్పట్లో ఆయన విశ్వనాథం తండ్రికి ప్రాణస్నేహితుడు. విశ్వనాథం కుటుంబానికి ఎంతో డబ్బు సహాయం చేశాడు. విశ్వనాథానికి స్టెనో ఉద్యోగం వేయించాడు. ఇలా రాధాక్రిష్ణగారు విశ్వనాథం కుటుంబానికి

కె. వివేకానందమూర్తి

ఎంతో దగ్గరవాడూ, కావల్సినవాడూ అవడం చేత, ఆయనికి విశ్వనాథంమీద ఒకవిధమైన అజమాయిషీ వుంది. పాతరోజుల్లో విశ్వనాథానికి, రాధాక్రిష్ణగారి దగ్గర భయం, భక్తీ వుండేవి. ఇటీవల ఆరెండూ కలిసి చనువుగా మారిపోయాయి.

దానికి కారణం రాధాక్రిష్ణగారిలో వున్న ఒకే ఒక దౌర్బల్యం, ఆలోపం కారణంగా-పెళ్ళి కాక మునుపు విశ్వనాథం తప్పటడుగులు వేసేరోజుల్లో ఆయన అతన్ని పార్కు కావల కాలువ వొడ్డునున్న ఒక కొంపలో యాదృచ్ఛికంగా కలుసుకున్నారు. ఆ కలయిక తర్వాతే ఆయన అతనికి పెళ్ళి చేయించారు.

డాబామీది ఆకాశంలో చీకటి మధ్య చుక్కలు మిణుగురుల్లా మెరుస్తున్నాయి. అతను నిశ్శబ్దాన్ని సహించలేకపోతున్నాడు. ఆయన, 'భార్యపోయి ఆర్నెల్లయినా బాధని కొంచెంకూడా మరువని ఈ వెర్రి వెధవని ఎలా సముదాయించాలి? వాడి మనస్సు ఎలా మళ్ళించాలి.' అని ఆలోచిస్తున్నారు. అతని కదలికతో ఆయన ఆలోచన తెగింది.

"ఏడుస్తున్నావా విశ్వం?"

"చాలాసేపు ఏడిచాను. ఓపిక చచ్చిపోయింది. ఇంక ఏడవలేను మేష్టారూ! అయినా ఏడిచి ఏంలాభం? సుమిత్ర అందం, సుమిత్ర మళ్ళీ తిరిగి వస్తాయా? అయినా ఏదో గుండెల్లో తెలియని బాధ, వెలితి. ఇక ఏడవను మేష్టారూ!" అతను చంటిపిల్లాడిలా ఏడుపు ప్రారంభించాడు. అతను ఏడుపు దాచుకోలేదు. ఆయన సముదాయించారు. ఆయన బుజ్జగింపుకి క్రమంగా అతనిలో కొంచెం స్థిరత్వం ప్రవేశించింది.

"నేనొకటి చెప్తాను వింటావా విశ్వం?"

"వినను మేష్టారూ!"

"ముందు నే చెప్పేది విను."

"తెలుసు. మీరు చెప్పబోయేది నాకు బాగా తెలుసు. నేను మరో పెళ్ళి కోలేను. చేసుకోను. నా సుమిత్ర చచ్చిపోయి, నాకు దూరమై పోయినా - రెండేళ్ళ సాహచర్యంతో గుండెల్లో నిండిన ఆప్యాయత, ప్రేమ ఇంకా నాకు దూరం కాలేదు. సుమిత్ర లాంటి వ్యక్తి నాకు మళ్ళీ దొరుకుతుందా? రెండేళ్ళ వ్యవధిలో నన్ను మగాడిగా ఎలా బ్రతకాలో చెప్పి మనిషిని చేసింది." అతను ఆగాడు. ఇప్పుడనిపిస్తోంది. ఆ నిండు తనం ఉన్నతిని తాను భరించలేదని ఇంత బలహీనుణ్ని ఆమెను ఎందుకు పెళ్లాడానా అనిపిస్తోంది.

"చూడు విశ్వం! సుమిత్రతో పెళ్ళి నీకు తెలిసే జరిగిందని తెలుసుగా-"

"ఎందుకు తెలియదు. తెలుసు. మీవల్లే జరిగింది. మీరే చేయించారు. రెండేళ్ళలో గుండె ఆగి చచ్చిపోయే; అందమైన సుమిత్రని నాకు మీరే తెచ్చి కట్టబెట్టారు."

"ఎందుకు కట్టబెట్టాల్సి వచ్చింది?"

"దానికికూడా మీరే కారణం. మీ లోపం వల్లే నేను మీకు పట్టుబడిపోయాను. అప్పుడు కోరికలు కూడా నన్ను చేతగానివాణ్నిగా చేశాయి. నేను చేతగానివాణ్ని. పుట్టినప్పట్నుంచీ అందరికీ లొంగిపోతున్నాను. ఆఖరికి నాకు నేనే-"

విశ్వనాథంలో బాధ వున్నంత వరకూ కన్నీళ్ళుకూడా ఉంటాయనిపిస్తుంది. అతని కంటివెంట కన్నీరు పాతచారల దారి ననుసరించి ధారావాహంగా కారుతోంది. ఉన్నట్టుండి ఆయన అన్నారు. "నాతోరా విశ్వం! బాధ విలువని చోటు చూపిస్తాను." తీవ్రమైన ఆలోచన ఫలితంలా వున్నాయి ఆ మాటలు. "పద వెళ్దాం" అని గొప్ప వ్యక్తిలా, సంస్కరణకి నడుంకట్టిన సంఘ సంస్కర్తలా లేచారు ఆయన.

విశ్వనాథం ఆయన్ని అనుసరించాడు. ఇద్దరూ డాబా దిగారు. రోడ్డుమీదకు వచ్చాక అతను అడిగాడు.

"ఎక్కడికి మేష్టారూ?"

"పార్కుకి."

ఇదా ఉపశమనం! అనుకున్నాడు. "వద్దు మేష్టారూ! పార్కంటే నాకు భయం. పార్కుకి వెడితే పిచ్చి పువ్వులు కనిపిస్తాయి. పిచ్చి పువ్వుల్ని చూస్తే నాకు మళ్ళీ సుమిత్ర జ్ఞాపకం వస్తుంది. పిచ్చి పువ్వులంటే పిచ్చెక్కిపోయేది సుమిత్ర. వద్దు నేను రాలేను."

"ఆ పార్కులో పిచ్చిమొక్కలేగాని, పిచ్చిపువ్వుల్లేవులే-పదు!" అని మందలింపు ధోరణిలో అన్నారు. పార్కువైపు దారితీశారు యిద్దరూ.

రోడ్డుమీద జనం పల్చబడుతున్నారు. రొజ్జ గాలి వీస్తోంది. కీచురాళ్ళ ధ్వని చీకటి స్థిరత్వాన్ని గుర్తు చేస్తోంది. అనుభవాన్ని పట్టుకు వదలని జ్ఞాపకాల్లా నక్షత్రాలు ఆకాశాన్ని పట్టుకు వ్రేలాడుతున్నాయి.

నగరం నడిబొడ్డునవున్న దట్టమైన పార్కులో ఎప్పుడూ తెల్లవారదు. రాత్రి ప్రపంచమంతటా గడిపే చీకటి పగలంతా అక్కడగడుపుతుంది. పొడుగుపాటి పార్కు కావల కాలువ పాపాన్ని మోసుకుపోయే పరీవాహంలా ప్రవహిస్తోంది. ఆయన కాలువమీద వంతెన దాటుతున్నారు. విశ్వనాథానికి పరిస్థితి అర్థమై పోయింది. మళ్ళీ రెండేళ్ళ తర్వాత ఆ ప్రదేశం తన్ను పరిచయం చేసుకుంటోంది. క్షణంలో అతని మనస్సు తన్ను కలచే మంచిజ్ఞాపకాన్ని వదలి మంచి అనుభవం కోసం తహతహలాడింది. భార్య మంచితనం, అమాయికత అతని క్షణిక నిర్ణయంలో నశించాయి. 'విశ్వం' అన్న పిలుపుతో ముందుకు కదిలి ఆయన్ని చేరాడు. అడుగుల్ని కొలుస్తూ అన్నాడు.

ప్రాసలీలాలోలు
దాశరథి పద్యాలు
కూనలమ్మ పదాలు
కూనలమ్మ పదాలు
రసికజనుల పెదాలు
వసియించు నేవేళ!

ప్రచురణ:
జ్యోతి బుక్స్,
విజయవాడ-2.

వెల: రూపాయి
పోస్టేజితోసహా
రూ. 1-88.

"ఎందుకో నవ్వొస్తోంది మేష్టారూ... రెండేళ్ళక్రితం ఇక్కడికి వచ్చినందుకు మందలించి భార్యని కట్టబెట్టారు. ఇప్పుడు మళ్ళీ భార్య కట్టువిడిపోగానే మందలింపుతో ఇక్కడికి తీసుకువస్తున్నారు. మీలాంటి మనుషులు ఉదాహరణకి దొరకరు." విశ్వనాథం నవ్వాడు. ఆయనా నవ్వేరు.

ఆ నవ్వుకి చుట్టుపక్కల కొంపల్లోని స్త్రీలు గుమ్మాల్లోకి వచ్చి హావభావాలు ప్రదర్శించడం మొదలుపెట్టారు తాపీకాళ్ళ ఎదురువచ్చి రాధాక్రిష్ణగారికి నమస్కరిస్తున్నారు. ఆయన ఇవేమీ పట్టించుకోలేదు. విశ్వనాథాన్ని వెంటబెట్టుకుని. తిన్నగా ఒకపాత పెంకుటిల్లోకి బ్రిగేడియర్‌లా ప్రవేశించారు ఇద్దరూ మూలగదిలోకి వెళ్ళారు. గదిమధ్యగా ఎనభై కేండిల్ పవర్‌దీపం విజయవాడలో వ్యభిచారంలా, రాజకీయనాయకుడి మోసంలా దేదీప్యమానంగా వెలిగిపోతోంది. గదికి ఒక పక్కగా పాతమంచం వుంది. దానిమీద చిందరవందరగా పడుకున్న పాతికేళ్ళ స్త్రీ కొత్త టేబిల్‌ఫాను గాలిలో సేద తీర్చుకుంటోంది. పమిట మంత్రిగాకమునుపు మంత్రిగారి వాగ్దానంలా, స్థిరత్వం లేక - వుండవలిసిన చోటునుండి తొలగిపోతోంది. పల్చటి తెల్లచీరెలోంచి ఆమెవొళ్ళు మెరుస్తున్నది.

రాధాక్రిష్ణగారి రాకతో ఆమె చటుక్కున లేచి, "మీరా రైసుమిల్లు బాబుగారూ!" అని వచ్చి మెడచుట్టూ చేతులువేయబోయి, విశ్వనాథాన్ని చూసి ఆగిపోయింది. అతను ఆమెని తదేకంగా చూస్తూ, అచేతనంగా నిలబడిపోయాడు. అతని మనస్సులో సుమిత్ర మెదిలింది. అవును. అంతా అదేపోలిక-అదే చికిలి కళ్ళూ. మరోతలకి ఉద్దేశింపబడి వట్టున్న ఆ దొప్ప చెవులూ. ఆ బరువు పెదాలూ-అంతా సుమిత్రే. అతని నరాల్లో అణుశక్తి ప్రవేశించింది. చిటికెన వేలుతేని ఎడమ చేతిని పాంటు జేబులో దాచేసుకున్నాడు.

"పేరు పంకజం. అచ్చం నీ భార్యలా వుంది కదూ? నిన్ను స్తిమితపరచగలదని తీసుకువచ్చాను. ఇక నీకు బాధ. వెలితి వుండవు నీబాధచూసి బాధపడే బాధ నాకు వుండదు. మరి నే వస్తాను" అని చెప్పి, పంకజానికి సౌజ్ఞచేసి రాధాక్రిష్ణగారు, కావలిసిన వాడికి సీటిప్పించమని రికమెండ్ చేసి వెళ్ళిపోయే చదువురాని పూరిపెద్దలా వెళ్ళిపోయారు. అతనికి ఆయనవెళ్ళిపోవటం తెలిసినా, తెలియనివాడల్లే నటించి-ఆమెను చూపులతో త్రాగేయడం మొదలుపెట్టాడు. తనకి యిదొక్కటి బాగా తెలుసు. అలా చూడటం అతనికి సుమిత్ర నేర్పింది

ఆమె దగ్గరికి వచ్చి అతని మెడచుట్టూ చేతులువేసి, తన రొమ్ముల్ని అతనిగుండెల కదిమి, పెదాలకేసి ఆశగా చూసింది. అతనికి వొళ్ళంతా వేడెక్కిపోయిందిగాని, ఏం చెయ్యాలో తెలియలేదు. ఏదో వొకటి చెయ్యకపోతే బాగుండదని ఆమె దొప్ప చెవుల్ని ముట్టుకున్నాడు. క్షణం ఆగి, పంకజం పకాలున నవ్వి అతన్ని మంచం మీదికి వొయ్యారంగా తోసింది. "మీకేం చేతకాదు." అని నవ్వుతూ గోముగా అంది.

"అవును. నాకేం చేతకాదు. నీకే అన్నీ చేతొచ్చు. మొదట్లో సుమిత్రకూడా ఈ మాటే అంది. రాధాక్రిష్ణగారు ఈ మాటే అన్నారు. నువ్వుకూడా ఈ మాటే అంటున్నావు. అవున్లే. నాకేం చేతొచ్చని. నేను శుద్ధ అమాయకుణ్ణి. నేను ఎందుకూ పనికిరాని వెధవని - నేను చేతకానివాణ్ణని నాకు తెలియదూ? ప్రతీ నిత్యం. ప్రతీ మనిషీ నాకెందుకు గుర్తుచెయ్యాలి?" అతను పంకజంకేసి జాలిగా చూస్తూ కన్నీరు పెట్టడం ప్రారంభించాడు. ఈ కొత్త వ్యవహారంచూసి పంకజం కంగారుపడిపోయింది. అయినా అనుభవం, సర్వీసూ కలిసి ఆమెకు కర్తవ్యం బోధించాయి. అతని పక్కకు చేరి. పమిటకొంగుతో కళ్ళు తుడుస్తూ. "తప్పండీ పాపాయిలా అలా ఏడవచ్చా? మగాళ్ళలో ఏడుపు బాగుండదు. ఏడవకండీ! మీరు బాధలోవున్నారని తెలీక నోరు జారాను అనాలని అనలేదు-మీకేం! మీకన్నీ చేతవచ్చు. మీకు చాలా తెలివుంది. అలా బాధపడకండి. అంతా మరచిపొండి. సుమిత్రనికూడా మరచిపొండి." అంది పంకజం కన్నీరు తుడిచిన పైట అలాగే వదిలేసి.

"అవును నిజంగా నేను తెలివైనవాణ్ణే. అందుకే సుమిత్ర చచ్చిపోయినా. ఆమెని నీ చికిలి కళ్ళలో, నీ దొప్ప చెవుల్లో-చూడగల్గుతున్నాను. నువ్వు చురుకైనదానివి. సుమిత్రకి యింత బాగా ఓదార్చటంరాదు." అమాయకుడు పాఠం వొప్పగించినట్టు అన్నాడతను. ఆమె వదిలిన పైటని ఏపుగా పెరిగిన రొమ్ములమీద కప్పివేస్తూ.

"సుమిత్ర మీ భార్య?"

"అర్నెల్లక్రితం వరకూ."

"పోనీలెండి. ఇకపైని ఆమెని మరచిపొండి. నేనున్నానుగా సుమిత్రకి బదులు" అని పంకజం విశ్వనాథాన్ని తనలోకి తీసుకుంది.

ఆమెకు అతని కౌగిలి 'సబిన్‌స్పెక్టరు' కౌగిలికంటె బలంగా తోచింది. అతని పెదాలు అడ్వకేటు అప్పలకొండ పెదాలకంటె కైపుగా వున్నాయి. అతని వక్షం 'సినిమాహాల' గేటుదగ్గరుండే 'సత్తినారాయణ' ఛాతీకంటె విశాలంగావుంది. అతనిలో వేడి ఎమ్మెల్యే అవ్వకమునుపు 'ఎదవలా తిరిగిన గోపాలం'కంటె యెక్కువగా వుంది. అతనిలో నెమ్మదిమాత్రం రాధాక్రిష్ణగారికంటె తక్కువగావుంది. ఇవన్నీ వున్న విశ్వనాథం గురించి యిలాంటి ఆలోచనలు వచ్చినందుకు మనస్సులో. ఎందుకో తనకు తెలియకుండానే. తన్ను తాను నిందించుకుంది.

కాలం గంటల్ని మింగి. రేపుకి సిద్ధమౌతోంది. చాలారాత్రి గడిచింది. 'రేపు కూడా రండి. రోజూ రండి' అనే పంకజం వీడ్కోలుతో విశ్వనాథం వీధిని పడ్డాడు. చీకటి మరీ దట్టమయి పోతోంది - అతని మనస్సులో పంకజంమీద క్షణక్షణానికి పెరుగుతున్న ప్రేమలాగ. ఇంటికి వెళ్ళి, దాబా యెక్కి హాయిగా మేనువాల్చిన విశ్వనాథం 'రేపు రాత్రి తర్వాత పగలు వస్తే బాగుణ్ను' అనుకుని నిద్రపోయాడు.

మర్నాటినుండీ విశ్వనాథం క్రమం తప్పకుండా, కాలేజీకి చదువుకునే అమ్మాయిలా, పంకజం యింటికి రాకపోకలు సాగించాడు. అతని అమాయకత, చిత్రమైన ప్రవర్తన, వింత మొగలక్షణం ఆమెనికూడా ఆకట్టాయి. అతని పరిచయం తర్వాత ఆమె ఇతరులెవ్వరికీ వొళ్ళివ్వలేదు. అలా చేయడానికి ఆమెకు మనస్కరించడం లేదు. అతను కనిపించని రోజున ఆమె గిలగిల్లాడి పోయే స్థితివరకూ వచ్చేసింది. ఆమె

వృత్తికి అలవాటు పడి. పాత బడిపోయినా. ఆతనిమీద మమతని. అప్యాయతని. దగ్గరితనాన్ని పెంచుకోగల్గింది. ప్రజలు నవ్వుతారని భయంగానీ - లేకపోతే ఆమె విశ్వనాథాన్ని ప్రేమించానని బాహాటంగా చెప్పుకోగలదు.

రోజులు గడిచే కొద్దీ విశ్వనాథం. పంకజం వొంటికీ. మనస్సుకీ మరింత దగ్గిరై పోసాగాడు.

ఈ విషయమంతా రాధాకృష్ణగారికి నెమ్మదిగా అవగతమైంది. అతనిబాధని మరిపించటానికి చేసిన ప్రయత్నం ఇలాఅయిపోతుందని. యింత గ్రంథాన్ని నడిపిస్తుందని ఆయన అనుకోలేదు. ముందు యేదో విధంగా బాధ మరచిపోయేలా చేసి. అప్పైన యెవర్నో ఒకర్ని తెచ్చి అతని కిచ్చి. రెండోపెళ్ళి జరిపించేద్దామని అనుకున్నాడు. కాని తన ఆలోచన మరీ దూరమై అందకుండా పోయింది 'అక్కడికి ఎరక్కపోయి తీసుకువెళ్లాను కోతి వెధవని' అనుకున్నాడాయన అతని కుటుంబానికి తన మూలంగా చెడ్డపేరు వస్తుందేమోనని భయపడ్డాడు. అలా భయపడగానే ఆయన అకు చెప్పులు తొడుక్కుని. హడావుడిగా అతని యింటికి వెళ్లాడు. అతను యింట్లోలేడు. అతనిలో చేతకాని తనంలాగే. డాబా ఎక్కే తనంకూడా వుందని ఆయనకి తెలుసు. డాబామీదకువచ్చి పిట్టగోడమీద కూర్చుని వంగిన మామిడి చెట్టు ఆకుల్ని త్రుంచుతున్న విశ్వనాథాన్ని. 'విశ్వం!' అని పిలిచాడు. ఆ పిలుపులో భావం అతనికి తెలుసు. ముఖ్యమైన వంగతులు చెప్పేటప్పుడు ఆయన ఉద్రేకపడలేదు. అతను వెనక్కి తిరిగి పిలిచాడు! ఆయన కూర్చుంటూ అడిగారు. "ఆలోచిస్తున్నావా!"

"ఎవర్ని గురించి మేష్టారూ?"

"ఎవర్ని గురించో నాకు తెలుసు. ఆ రోజు మొదలు నీకు ఉన్నదీ. వుండేదీ ఒకే ఆలోచన అని కూడా తెలుసు". ఆయన ఆగాడు "జీవితానికి ఇన్నేళ్ళుగా అలవాటు పడికూడా నేను పెద్ద పొరపాటు చేశాను విశ్వం!"

"ఏమిటో! నాకేమీ తెలియట్లేదు మీరనే మాటలు."

"మొదట్లో పంకజాన్ని చూసినప్పుడు నాక్కూడా ఏమీ తెలియలేదు. జీవితం నన్ను తనవైపు తిప్పుకుని. లోకువచేసి ఒక దౌర్బల్యాన్ని నాకు అంటగట్టింది." విశ్వనాథం ఆకులు త్రుంచడం మానేశాడు.

"ఒక్కటి చెప్తాను వింటావా విశ్వం - పంకజాన్ని మరచిపోయి రెండో పెళ్ళి చేసుకో బ్రతుకులో మంచి అర్హత భార్యని పొందడంకోసం. స్త్రీని పొందడంకాదు. నాకు తెలిసిన సంబంధం వొకటుంది."


"వద్దు మేష్టారూ! నాకు రెండో పెళ్ళి వొద్దు నేను పంకజానికి దూరంగా వుండలేను. ఆమె లేకపోతే బ్రతకను."

"బ్రతకాలంటే ఆమెలాంటి పతితే కావాలా? లోకంలో ఎందరు తమ భార్యలతో కాపరాలు చేస్తూ హాయిగా బ్రతకట్లేదు?"

"నా దౌర్బల్యం నాకు తెలుసు. నా వంగతి వదిలెయ్. బ్రతుకులో సమస్యల








చివరికి జారిపోయాను. ముందు పెళ్ళికి సిద్ధపడు. ఆలోచించకు. పెళ్ళి విషయంలో ఆలోచన దాగుండదు" ఆయనలో ఏదో కావత్రయం. బాధ్యత స్పష్టమౌతున్నాయి ఉన్నట్టుండి విశ్వనాథం మాట్లాడాడు.

"నేను పంకజాన్ని పెళ్ళి చేసుకోదలిచాను మేష్టారూ!"

ఆయన ఉలిక్కి పడ్డాడు. "ఆ పతితనా? పదేళ్ళగా ప్రజల చేతుల మధ్య నలిగి మలినమైపోయిన పంకజాన్ని. చచ్చిపోయేవరకూ నీతోకలిసి బ్రతకడానికి ఎన్నిక చేసుకున్నావా?"

"ఆమె పతితకాదు ఎంతోనిండుదనంతో గర్వంతో. ఆత్మ విశ్వాసంతో సమస్యల మధ్య ఆశని పేర్చుకుని బ్రతికిన ఆడది.. ఆరోజు రావాలని! ఆమె దగ్గిరికి తీసుకువెళ్ళారు ఈ రోజు కావాలని ఆమెను దూరంగా పొమ్మంటున్నారు. ఎన్నో సార్లు నన్ను చేతకాని వాడిగా చేశారు మీరు. ఈ సారి నన్ను మార్చలేరు. ఏమైనా నేను పంకజాన్ని పెళ్ళి చేసుకుంటాను" మరో పక్కకి చూస్తూ ఉద్రేకపడి చెప్పాడు.

"విశ్వం! ఇలా చూడు. మొదటిసారిగా నీకు పనికిరానివాణ్నయ్యాను కదూ! నీ యిష్టం వచ్చినట్టే చెయ్యి. ఇన్నాళ్ళకి ఎలాగైతేనేం నామాట కాదనేటంత పెరిగిపోయావ్!" అతను పిలుస్తున్నా వినిపించుకోకుండా ఆయన ముఖం చిన్నబుచ్చుకుని మెట్లు దిగివెళ్ళిపోయారు. కాసేపు ఆకాశంలో రెక్కలు విరగ్గొట్టుకున్న పక్షిలా

దలించిపోయాడు అతను. దాబాదిగి మెల్లగా నడిచి పంకజం యిల్లు చేరాడు.

ఆమె రాత్రికి సిద్ధమౌతోంది. రోజూ కంటె త్వరగా వచ్చిన అతన్ని చూసి వుత్సాహంగా యెదురువచ్చింది. వస్తూనే అన్నాడతను.

"నీతో ఒకముఖ్యమైన మాట చెప్పాలి పంకజం!"

"ఏమిటి? మీఎడమచేతికి వేలు లేదనేగా? వేలే కాదు. మీకు చెయ్యిలేకపోయినా, మీరు అప్రయోజకులైనా, మీకేం చేతగాకపోయినా మిమ్మల్ని ప్రేమిస్తాను."

"అదుగో, మళ్ళా చేతకాని వాణ్ణంటున్నావ్!"

"ఏం? ఏడుస్తారా?" నవ్వింది.

"కాదు. ఈసారి నాచేతనయిన తనాన్ని రుజువు చేస్తాను."

"ఏడవటంతోనే?"

"అదుగో అలా తేలికచేసి మాట్లాడితేనే నాకు ఏడుపొస్తుంది. ఏడుపుకాదు-కోపం. ముందు నే చెప్పేది చెప్పనియ్యి."

"చెప్పండి!"

"ఏమీ అనుకోకూడదు మరి. ఒక్క మాటడుగుతాను" అని దగ్గరగా వున్న ఆమెని మరింత దగ్గిర చేసుకుని, కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అడిగాడు.

"నువ్వు నన్ను నిజంగా ప్రేమిస్తున్నావా? లేక వృత్తి ధర్మంగానా?" ఆమె తటాలున విడిపోయి, అటువైపు తిరిగిపోయింది. "ప్రేమించడమే నా వృత్తి. అలాగే ప్రేమిస్తున్నాను." ఆమె గొంతు వొణికింది.

"పంకజం!" అతను చకితుడయాడు.


పంకజం బావురుమంది. ఎప్పుడూ ఏడవని పంకజం ఏడిచింది. "అవును. నేను బజారుదాన్ని. బేవార్సు సరుకుని. మీ భాషలో పతితని. నాకు ప్రేమించే అర్హతలేదు. అదేగా? మీ స్నేహంతో నేను ప్రైవేటు దాన్నయిపోయాను. మామూలు ఆడదాన్నయిపోయాను. అయినా నావొళ్ళుమాత్రం చెడు పురిమేసుకుని. అలాగే వుండిపోయింది. అది నాఖర్మ. పంతులుగారూ! నేనుప్రేమిస్తున్నానంటే ఇన్నాళ్ళూ లోకమే నవ్వుతుందనుకున్నా. కాని మీరుకూడా నవ్వుతున్నారు. నవ్వండి. బాగా నవ్వండి. నవ్వి నవ్వి గుండె పగిలి చచ్చిపోతా. అలా చచ్చిపోతున్నప్పుడు మాత్రం ఒక్కసారి ఈ పిచ్చి పంకజం మిమ్మల్ని నిజంగా గుండెలు నిండేలా ప్రేమించిందనిమాత్రం నమ్మి మరీ ప్రాణాలు వొదలండి." వెర్రి ఆవేశంతో మాట్లాడిన పంకజం ఆయాసపడింది. "మీరిప్పుడు నిజంగాచేతనైనవారు."

కమిలిపోయిన కలువ పువ్వులావున్న ముఖాన్ని అతని వెంపు తిప్పింది. ఆమె నివ్వెరపోయింది. విశ్వనాథం మామూలుగానే ఏడుస్తున్నాడు. ఆ ఏడుపువెనక అర్థం పంకజం మనస్సుకి తెలుసు. ఆమె కోపమంతా మాయమయింది. క్షణంలో సంతోషం కట్టతెగి నవ్వు వచ్చింది. అతన్ని దగ్గరికి తీసుకుని తల్లిలా అంది.

"నిజంగా మీకు ఏడవటం బాగా చేతవును."

"కాదు. నాకు బాగా ప్రేమించడం కూడా చేతవును - పంకజం! - మనం పెళ్ళిచేసుకుందాం.






ఆ మాట వినగానే ఆమె చలనరహితంగా మారిపోయింది.

"ఏం? అనుమానిస్తున్నావా నన్ను? నిజం పంకజం! నేను మరెవ్వరి దగ్గరికీ వెళ్ళలేదు. నీ దగ్గరికి మాత్రమే వస్తున్నాను. నిజంగా నిన్ను పెళ్ళిచేసుకుంటాను. ఈ పాడుబ్రతుకు మానేసి నాతోరా! నీలాంటి వాళ్ళ కనుమరుగై పోయిన ఒక మంచి జీవితం మా కుటుంబాల్లో వుంది. నీకది చూపిస్తాను. నిన్నాక ఆదర్శ భారత స్త్రీగా మలుచుకుంటాను. నా భార్యవని నలుగురితో గర్వంగా చెప్పుకుంటాను."

"కాని నేను మీ భార్యగా నలుగురితో ఎలా చెప్పుకోనేది? నలుగురి దృష్టిలో నేను చెడిపోయినదాన్ని. నాతో కలిసి ఉండటానికి సిద్ధపడిన మిమ్మల్నొక తెలివి తక్కువ మనిషిగా చూస్తారు. వద్దు పంతులుగారూ! వద్దు! ఆ బ్రతుకు నేను బ్రతకలేను. ఆ యోగ్యత, ఆ పవిత్రం నాకు లేవు. నన్నిలాగే వుండనీయండి. మీరు యిలాగే వస్తూ వుండండి!"

"అలా అనకు పంకజం! నిన్ని విధంగా చూస్తూ నేను సహించలేను. నాకు నువ్వే కావాలి." అని ఆమెని వొళ్ళంతా కౌగిలించుకున్నాడు.

ఉన్నట్టుండి ఊళ్ళోనూ, యింట్లోనూ కరెంటు పోయింది. గదిలో దీపం ఆరిపోయింది. అతను కంగారు పడ్డాడు. సుమిత్రలా చచ్చి పోతుందేమోనని. భయంతో వణికాడు. అంతలోనే ఊళ్ళోనూ, యింట్లోనూ కరెంటు వచ్చేసింది. గదిలో దీపం వెలిగింది. పంకజం సుమిత్రలా విరుచుకుపడి పోలేదు. చచ్చిపోలేదు. పంకజం బ్రతికేవుంది. అతని మనస్సు ఆశతో రెపరెపలాడింది. మనస్సుతో ప్రేమకోరిక వొళ్ళు విరిచింది.

అంతని లో చేతనత్వం ప్రవేశించింది. తన్ను చేతనయినవాడిగా గుర్తించుకున్నాడు.

క్షణం తర్వాత విశ్వనాథం ధైర్యంతో, ఆత్మస్థైర్యంతో పంకజాన్ని చేతులమీదికి ఎత్తుకున్నాడు. ఇంట్లోంచి బైటికి వచ్చాడు. పంకజం విడుపుకోసం విశ్వనాథం చేతుల మధ్య విఫలంగా పెనుగులాడుతోంది. ఆ క్షణం అతనికి, ఆ ప్రదేశంచుట్టూ పాపం గూడుకట్టుకున్నట్టు అనిపించింది. అతను గంభీరంగా అడుగులు వేస్తూ, గమ్యంవేపు కదిలాడు. ఆమె చేతులమధ్య గింజుకుంటోంది. 'విడిచిపెట్టండి. నన్ను వదలండి' అంటూ అరుస్తోంది. చేతులతో అతని బుజాలమీద కొడుతోంది. అతను నిశ్చలమైన మనస్సుతోనూ, పొత్తిళ్ళలో పంకజంతోనూ నడుస్తున్నాడు.

ఆమె చీకటి భయపడేలా వొళ్ళు విరుచుకుంటూ కేకలు వేస్తోంది. ఆమె అంగవిన్యాసంతో అతని వొళ్ళు పులకించగా పెదాలమీద చిరునవ్వు మెరుస్తోంది. ఆమె కేకలకి నిశ్శబ్దం గుండె పగిలింది.

కన్నుమూసి తెరిచేలోగా, చుట్టూవున్న కొంపల్లోంచి ఆడజనం, మగజనం వడివడిగా వచ్చి మూగారు. ఆమె పెనుగులాట మానలేదు. జనం చూస్తున్నారు. రణగొణ ధ్వనితో మాట్లాడుతున్నారు.

"గుంటమీద గొడవేనేటి?"

"మందుకొట్టేశాడేటిగురూ?"

"నంజికూతురు గిజగిజలాడి పోతన్నాది వదిలిపెట్టోయ్!"

"అదీ యేసేసిందేమో మెడిసిన -"

ఇంతలో దూరంగావున్న కొంపలోంచి, యూనిఫారమ్ సరిచేసుకుంటూ ఇద్దరు పోలీసులు విసురుగా వచ్చారు. జనాన్ని అదిలించారు. ఇద్దర్నీ విడదీశారు.

"ఏటిగొడవ?" అని అడిగాడు ఒక పోలీసు.

"ముందు స్టేషనుకి పదండి. అక్కడ చూసుకుందాం!" అన్నాడు రెండో పోలీసు.

"వెళ్ళండి! మీకెందుకు మా సంసారం గొడవ! మొగుడూ, పెళ్ళాలమధ్య తగూ మీరేం తీర్చనక్కర్లేదు. పొండి!" అని విసురుగా అంది - కేకలువేసి, విశ్వనాథం చేతులమధ్య గింజుకొని, నలిగి అలిసిపోయిన పంకజం.

"ఓసోస్! పంకిపతివ్రతయిపోయిందెహో!"

"ఎవడాడు? పంకినంజికి మొగుట్ట! యెర్రెదవనాయాల!" అని రకరకాలుగా అనుకుంటూ, జనం కాలం వృధా చేయకుండా, ఎవరికొంపల్లోకి వాళ్ళు వెళ్ళిపోయారు. వారిద్దరూ వేటిని లెక్కచేసే స్థితిలో లేరు.

"వీ మొగుడేనేటి?" అని మొదటి పోలీసు, రెండో పోలీసుతో వెళ్ళిపోయాడు.

విశ్వనాథం, పంకజంతో తన దాబా యింటివేపు నడిచాడు.

• • •

చిక్కటి వెన్నెల వూళ్ళో విద్యుద్దీపాల్ని వెక్కిరిస్తోంది. దూరాన పాత పంకజంవున్న పేట. అదే వెన్నెల్లో మకిలిగా, వెగటుగావుంది.

దాబా పిట్టగోడమీద మళ్ళీ అదే చిక్కటి వెన్నెల్లో - విశ్వనాథం, పంకజం తలవుంచి "నువ్వు నా భార్యవి!" అన్నాడు.

దాబా చివర మెట్లవద్ద ఆగిపోయిన రాధాక్రిష్ణగారి పాతమీసం కింద, పెదాల నవ్వు భావం ఏమిటో అర్థంకాలేదు.

□□□







# హాస్యబ్రహ్మ శ్రీ భమిడిపాటి కామేశ్వరరావు

"నవ్వు అంటే ఏమిటి?" అనే ప్రశ్నవేస్తే 'ఇహ్హీ' అని ఒక నవ్వుదాఖలు చేసుకోవడం తేలికగాని, నిర్వచించడం నవ్వులాటకాదు.